
# లాడ్జీరూం

అంబల్ల జనార్దన్

అప్పుడే వచ్చిన బాంబే ఎక్స్‌ప్రెస్ లోంచి దిగాం నేనూ, సతీష్.

హైద్రాబాద్ స్టేషన్, రద్దీగా ఉంది. పది గంటలుకు ఓ సాహితీసదస్సు, పుస్తక ఆవిష్కరణ సమావేశానికి హాజరై, రాత్రి బాంబే ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి పూనావెళ్ళాలి.



ఓ మిత్రుని కథాసంపుటి ఆవిష్కరణ ఈ రోజు. బాగా కావలసిన మిత్రుడవడం వల్ల , నా కథల సంపుటి ఆవిష్కరణకు ఆయన పూనానుంచి వచ్చినందు వల్ల, నాకు భాగ్యనగరం రాక తప్పలేదు.

సతీష్ మంచి పాఠకుడు, సాహిత్యాభిమాని.

శని వారం ఆఫీసు తర్వాత బయలు దేరాం. సోమవారం డ్యూటీ అటెండ్ కావాలి. సాహిత్యంలో పడి ఉద్యోగబాధ్యతలు విస్మరించలేము కదా! మంచి హోదాగల ఉద్యోగంలో ఉన్నామాయె!

పదిగంటలకు కార్యక్రమం.

దిల్‌సుఖ్ నగర్ లోని మా బంధువుల ఇంటికి పోవడానికి టైమ్ లేదు. స్టేషన్ దగ్గరే ఏదో ఓ రూం తీసుకుంటే స్నానాలు చేసి చిక్కడపల్లి పోవచ్చు.

సమావేశం తర్వాత సాహితీ మిత్రులతో హస్కుకొట్టి, సాయంత్రం ఆరుగంటలవరకు రూముకు రావాలి. స్నానం , భోజనాదులు చేసి ఎనిమిది గంటల రైలు ఎక్కాలి. ఇదీ స్థూలంగా మా ప్రోగ్రాం.

నాంపల్లి స్టేషన్ దగ్గరి ఇరానీ హోటల్ 'చాయ్‌తాగి, సతీష్ బ్యాగులతో పాటు అక్కడే ఉండమని చెప్పి, లాడ్జీరూం వేటకి బయలు దేరాను. స్టేషన్ దగ్గరి ఒక్కలాడ్జీ నచ్చలేదు. కొన్ని మరీ మురికిగా ఉన్నాయి.

కొన్ని మురికిగానే కాకుండా కాస్ట్లీగా కూడా ఉన్నాయి. మూడు నాలుగు వందలకు తక్కువలో మంచి రూం దొరికేట్టు లేదు. అదీ కేవలం స్నానాదులుచేయడానికి అంత డబ్బు ఖర్చుచేయడానికి మనసొప్పలేదు.

స్టేషన్ అవతలివైపు, చవకలో మంచి గదులు దొరుకుతాయని ఒకరు చెప్పారు. అక్కడ ప్రయత్నం చేద్దామని. సతీష్ దగ్గరికి వచ్చాను.

అసహనంగా ఉన్నా సతీష్, "ఏదో ఓ రూం లెద్దూ" అన్నాడు

కాని, నాకు నచ్చిన రూము, నేను మెచ్చే ధరలో దొరకాలి! అంతదాకా తృప్తిఉండదు!అయిదు రూపాయలకు రిక్షా మాటాడి, స్టేషన్ అవతలి వైపుకు

జయలు దేరాము. రిక్షా అవతలి వైపుకు చేరగానే చాలా బోర్డులు కనిపించాయి.

రిక్షావాణ్ణి తీరిగ్గా రమ్మని చెప్పి, వడివడిగా ఓ లాడ్జి వైపు నడిచాను.

"నేనే మంచి లాడ్జికి తీసికెళతాను సార్" అన్న రిక్షా వాడి మాట వినిపించుకోలేదు. వాడు తన స్పీడు పెంచాడు కాని ట్రాఫిక్ మూలాన నన్నందుకో లేకపోయాడు.

వాడు స్పీడెందుకు పెంచాడో నాకు తెలుసు. అందుకని వాడికంటే ముందు రెండో అంతస్థులోని లాడ్జికి చేరాను. అక్కడి రూం నచ్చడంతో నూట పాతిక రూపాయలకు సెటిల్ చేశాను. రిక్షా వాడి ద్వారా అయితే ఇంకో పాతిక ఎక్కువే అయ్యేది.

పాపం రిక్షా వాడు!

వాస్పీడందుకోలేకపోయాడు! వాని మొహం చిన్నబోయింది. ఇచ్చిన అయిదు రపాయలు గొణుక్కుంటూ తీసుకున్నాడు.

"ఇంత దూరం వచ్చాను. రెండవ అంతస్థుదాకా మీ సామాను మోసాను. ఇంకో అయిదు రూపాయలు ఇవ్వండి సార్" అన్నాడు.

సతీష్ వెంటనే అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

నాకది నచ్చలేదు. అప్పటికిఊరుకున్నాను.

కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

నా రాకతో , నా మిత్రుడు చాలా సంతోషించాడు!

దినమంతా సామితీ మిత్రుల మధ్య ఆనందంగా గడిపాము. హోటలు రూముకు వచ్చి ఫ్రెష్ అయ్యాం.కాస్త రెస్ట్ తీసుకుని జయలు దేరాము. రైల్వే క్యాంటీన్ లో భోంచేసి ట్రెన్ ఎక్కాం.

సతీష్ ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు. ప్రొద్దుట రిక్షా వాలా గురించి, అప్పుడు కదిపాను.

"ఈ రిక్షావాళ్ళు నీకు తెలీదు.వాళ్ళకూ లాడ్జీ వాళ్ళకు లావాదేవీలుంటాయి. మనం ఇచ్చే రిక్షా బాడుగ కాక, లాడ్జీ వారి నుండి కమీషనుతీసుకుంటారు. అదిమన రూం చార్జీలో కలుస్తుంది. అందుకే నేను ప్రొద్దున అంత హడావిడి పడింది. నీవేమో వాడికి అయిదు రూపాయలు, అప్పనంగా , అదనంగా ఇచ్చావ్".

"ఎవరి పొట్టతిప్పలు వారివి. అయిదంకెల జీతం తీసుకునే మనకు అయిదు రూపాయలు లెక్కకాదు! "ఇక్కడ పశ్న, అయిదు రూపాయలని కాదు. ఈ సమస్య వారి మెంటాలిటీకి సంబంధించినది. నా ప్రమేయం లేకపోతే వాడు మనకి పాతిక రూపాయలకు టోపీవేసేవాడు. బాడుగ ఎక్కువ అడుక్కోవాలిగాని , ఈ కమీషను కక్కుర్తి ఏమిటీ? "

"అది లాడ్జీ వ్యాపారంలోని కిటుకు. పోటీల్లో నిలబడాలంటే రిక్షా వారికి కమీషనే ఇవ్వక తప్పదు. వారే గదా ప్యాసింజరులను తెచ్చేది!ఆ కమీషను రూం బాడుగలో కలుపకపోతే వారికి గిట్టుబాటయ్యేది ఎలా ? "

"ఏమైనా ఈ కమీషను పద్ధతిని నేను సమర్థించను'

"అది మన వ్యవస్థలోనే ఉంది. దాన్ని నీవూ,నేనూ మార్చలేం. మనం ట్రావెల్ ఏజెంటు ద్వారా బుక్ చేస్తాం. వారు కమీషను తీసుకోరూ? అదే రిక్షావాడు, మన స్పాట్ ట్రావెల్ ఏజెంట్ అనుకుంటే సరి! వాడి కమీషన్, మన స్థోమతకు మించింది కాదు కదా! ట్రెన్ దిగగానే అలా ఓ రిక్షా వాణ్ణి కుదుర్చుకుంటే సరిపోయేది. అనవసర శ్రమ తప్పేది , గంట సమయం కలిసి వచ్చేది!

నేను బదులివ్వలేదు. ఆలోచిస్తే, సతీష్ వాదన సమంజసమే అనిపించింది.

అంబల్ల జనార్దన్
ఎ/36,శివకీర్తి కో.హౌ.సా.లి.,
చించోలీ బందర్‌రోడ్, మాలాడ్ (వెస్ట్),
బొంబాయి- 400 064

## దీప్తి



మమతలు మనసులు కలిసినప్పుడు
కోరికలు హద్దులు మీరనప్పుడు
రీతులు సమాజాన్ని మార్చినప్పుడు
మనిషి
మనిషిని అర్థం చేసుకున్నప్పుడు
సమాజం
శోభయమానమై దీప్తినిస్తుంది!


అమ్మన చంద్రారెడ్డి,
సిద్దిపేట

# వాటర్ బెడ్ కారు

వాటర్‌తో నింపబడి ఉన్న బెడ్స్ కలిగిన ఈ వాటర్ బెడ్ కార్లను జపాను వారు రూపొందించారు. ఇవి వేగంగా ప్రయాణించటానికి కాక ప్రయాణికుల సుఖం కోసం కూడా తయారు చేయబడ్డాయి. ఈ ఎలక్ట్రిక్ కార్లలో సోనార్ మసాజర్ ఉన్న వాటర్ బెడ్ ఆడియో మరియు వీడియో సిస్టమ్స్ ఉండి ప్రయాణికులకు ఎంతో సంతోషాన్నిస్తాయి. కాని దీని వేగం గంటకు 3.6 మైళ్ళు మాత్రమే. 1,85,000 డాలర్ల ఖరీదు గల ఈ కార్లు త్వరలో మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి.

# తేలికయిన కారు వేగంగా నడిచేకారు

కార్ల బరువు ఎంత తక్కువయితే అంత వేగం పెరగటమే కాకుండా ఇంధనం ఆదా అవుతుందంటున్నారు శాస్త్రవేత్తలు. చిత్రంలో గల ఈ కారును స్విస్ కంపెని వారు తయారుచేశారు. దీని బరువు 1365 పౌన్లు మాత్రమే..నికెల్, కాడ్మియం బ్యాటరీ సాయంతో నడిచే ఈ ఎలక్ట్రిక్ కారు గంటకు 90 మైళ్ళ వరకు ప్రయాణిస్తుంది..భద్రత కోసం దృఢమైన ప్యాసింజరు కంపార్టుమెంటు, ఫ్రంటల్ క్రష్‌జోన్, డ్యూయల్ ఎయిర్ బ్యాగ్స్ మొదలయిన సౌకర్యాలున్న ఈ కారు వేగంగా పరుగెత్తేదే మరి.




డి . శ్రీధర్, డి.కొండాపురం, రాయదుర్గం ( తాలూకా ), అనంతపురం ( జిల్లా )